క్లుప్తంగా

భూ సర్వే పనులు పరిశీలించిన తహసీల్దార్



అందుకూరు(క్రోసూరు): మండలంలోని అందుకూరు గ్రామంలో భూ సర్వే పనులను గురువారం తహసీల్దార్ వీవీ నాగరాజు పరిశీలించారు. గ్రామంలో మూడు టీములుగా సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తహసీల్దార్ తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పూర్తి విస్తీర్ణం తెలియజేస్తూ 1935 ఎకరాలుందని, రైతుల డాక్యుమెంట్ల ప్రకారం వాస్తవ హద్దులు గుర్తించటం జరుగుతుందన్నారు. పూర్తి ఏరియా సర్వే చేసిన అనంతరం డాక్యుమెంట్లకు, కొలిచిన కొలతలకు తేడాలుంటే అభ్యంతరాలు స్వీకరించటం జరుగుతుందన్నారు. అభ్యంతరాలను పరిష్కరించిన అనంతరం ఆన్‌లైన్ చేయటం జరుగుతుందని తెలిపారు. ఆన్‌లైన్ చేసిన తరువాత పాస్‌పుస్తకాలు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విలేజి సర్వేయర్లు జగదీశ్వరరెడ్డి, గోపీనాయక్, సాంబశివరావు, దామోదరరావు, హరి, రాజు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి వార్షిక తిరునాళ్ల



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. తిరునాళ్ళలో భాగంగా తెల్లవారుజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం హనుమద్దీక్ష విరమణ కార్యక్రమం, సామూహిక ఆకుపూజలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం హనుమత్ జ్యోతి దర్శనం చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యుత్ సరఫరాలో సమస్యలు లేకుండా చూడాలి

విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ విజయ్ కుమార్



బెల్లంకొండ : వేసవిలో గ్రామాలలో విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా విద్యుత్ సిబ్బంది ముందు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ పత్తిపాటి విజయ్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని బెల్లంకొండ, పాపాయపాలెం గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. సబ్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మండలంలోని ప్రతి గ్రామంలో త్రీఫేస్ లైన్లు, ఆర్‌డీఎస్ఎస్ వర్కులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. మండలంలోని వెంకటాయపాలెం గ్రామానికి ఆర్‌డీఎస్ఎస్ లైన్ వేయడానికి అటవీ శాఖ అధికారుల అనుమతులు కావాల్సి ఉందని స్థానిక అధికారులు ఎస్ఈ దృష్టికి తీసుకువచ్చారు. అనుమతుల కోసం అటవీ శాఖ అధికారులతో మాట్లాడతానని ఆయన పేర్కొన్నారు. ఎస్ఈ వెంట డీఈఈ ఎన్.సింగయ్య, ఏడీఈ సురేష్ బాబు, స్థానిక ఏఈ పవన్ కుమార్, ఎల్ఐ మోహనరెడ్డి, లైన్ మెన్లు, షిఫ్ట్ ఆపరేటర్లు ఉన్నారు.

పన్నులు త్వరగా చెల్లించాలి

క్రోసూరు: క్రోసూరు పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం ఇళ్ల పన్నులు, వ్యాపార సంస్థల పన్నులు త్వరగా చెల్లించాలంటూ మైకు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి వెంకయ్య వివరిస్తూ మొత్తం పనులు రూ.32 లక్షలు, వసూలు కావాల్సినవి పాత బకాయిలు రూ.32 లక్షలు కలిపి రూ 62 లక్షలు పనులు వసూలు కావాల్సి ఉందన్నారు. అయితే ఈ నెలలో ఇప్పటి వరకు 15 శాతం మాత్రమే వసూలు చేసినట్లు తెలిపారు. మిగతావి ఈ నెలాఖరుకల్లా వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సహకరించి త్వరగా పన్నులు చెల్లించాలని కోరారు. పంచాయతీ పన్నులు వసూలు చేయటం వలన పంచాయతీలో అనేక అభివృద్ధి పనులు, పారిశుధ్య పనులు చేపట్టేందుకు వీలవుతుందన్నారు.

కూటమి నిర్ణయం.. రైతులకు శాపం

- క్షేత్ర స్థాయిలో అమలు కాని విడతల వారీ నీటి విడుదల విధానం
- ఎండిపోతున్న మిర్చి పంట
- ఇప్పుడిప్పుడే కాపుకొస్తున్న మొక్కజొన్న, పొగాకు, మినుము, నూగు పంటలు
- విద్యుత్ అధికారుల చిన్నచూపుతో మరిన్ని కష్టాలు



చుక్కనీరు లేని చింతపల్లి మేజర్ కాలువ



పూతకొచ్చిన నూగుపంట



సాగునీరు లేక ఎండిపోతున్న మిర్చి పంట

అచ్చంపేట: మండలంలోని పలు గ్రామాల్లో సాగర్ కెనాల్స్ నుంచి సాగు నీరుందక రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చింతపల్లి మేజర్ కాలువ ద్వారా సుమారు 4,000 ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. చింతపల్లి మేజర్ కింద కొండూరు, నిండుజర్ల, పెదపాలెం, మిట్టపాలెం, నీలేశ్వరపాలెం, అచ్చంపేట గ్రామాలకు చెందిన ఆయకట్టు భూములున్నాయి. నాగార్జునసాగర్ కెనాల్స్ ద్వారా వచ్చే చింతపల్లి మేజర్ కాలువ కింద ఉన్న ఆయకట్టుదారులంతా సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మొదట కస్తల మేజర్ కాలువ కింద ఉన్న భూములకు, చింతపల్లి మేజర్ కింద ఉన్న భూములకు వంతులు, విడుతల వారీగా సాగు నీటిని సరఫరా చేస్తామని ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు. కానీ ఆ విధానాన్ని అమలు పరచకపోవడంతో కస్తల మేజర్ కింద ఉన్న వేల్పూరు రైతులు సాగునీటి కోసం రోడ్డెక్కి ధర్నాలు చేయడంతో స్థానిక ఎమ్మెల్యే కల్పించుకోవడంతో కస్తల మేజర్‌కు నీళ్లు వదిలారు. దీంతో కూటమి ప్రభుత్వ నిర్ణయం రైతులకు శాపంలా పరిణమించింది.

కంటితుడుపు చర్యలు

ఇరిగేషన్ అధికారులు చెప్పిన విధంగా వంతుల వారీగా తమకూ సాగునీరు వదలాలని చింతపల్లి మేజర్ కింద ఉన్న ఆయకట్టు రైతులు ఆందోళనకు దిగడంతో కంటితుడుపు చర్యగా రెండు, మూడు రోజులు మాత్రమే వదిలి ఆపేయడం వల్ల కొన్ని గ్రామాల రైతుల భూములకు అసలు సాగునీరే అందలేదని రైతులు చెబుతున్నారు.

సాగర్ నీళ్లే శరణ్యం

చింతపల్లి మేజర్ కింద ఉన్న కొండూరు, నిండుజర్ల, పెదపాలెం, మిట్టపాలెం, నీలేశ్వరపాలెం, చామర్రు భూములకు సాగర్ నీళ్లే శరణ్యం. సాగునీరు అందకపోవడంతో ఈ భూములలో వేసిన కోత దశకు వచ్చిన మిర్చి పంట ఎండిపోతోంది. అసలే ఈ ఏడాది మిర్చి దిగుబడి గణనీయంగా తగ్గింది, ఉన్న కొద్దిపాటి పంటకు కూడా ధరలేక రైతులు అవస్థలు పడుతుంటే, అదీ చాలదన్నట్లు సాగర్ నీరు రాకపోవడంతో చేతికొచ్చే కాస్తో కూస్తో పంట కూడా ఎండిపోయే పరిస్థితులు దాపురించాయని ఆవేదన చెందుతున్నారు.

సాగునీరు అత్యవసరం

మిర్చి పంటతో పాటు కొంత మంది తక్కువ పెట్టుబడితే దిగుబడులు వచ్చే మొక్కజొన్న, పొగాకు, నూగు, మినుము పంటలతో పాటు కూరగాయల పంటలు కూడా పండించుకుంటున్నారు. ఈ పంటలు ప్రస్తుతం కాపు దశకు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో నీళ్లు పెడితేగాని పంట చేతికందే పరిస్థితులు లేవు.

విద్యుత్ అధికారుల చిన్నచూపు

పెదపాలెం, నీలేశ్వరపాలెం, చామర్రు గ్రామాల కింద ఉన్న రైతన్నలపై విద్యుత్ అధికారులు కూడా చిన్నచూపు చూపుతున్నారు. పెదపాలెం, నీలేశ్వరపాలెం, చామర్రు గ్రామాలకు చెందిన కొంత మంది రైతులు బోర్లు వేయించుకుని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తులు చేసుకుని ఎదురు చూస్తున్నారు. కంటి తుడుపు చర్యగా స్తంభాలు వేసి వదిలేశారు. కాసారాలు బిగించి తీగలు లాగడం గానీ, ట్రాన్స్‌ఫార్మర్స్ బిగించడం గానీ చేయలేదు. దీంతో స్తంభాలకు సపోర్టు లేకపోవడంతో గత సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సంభవించిన తుపానుకు విరిగి నేలమట్టమయ్యాయి. ఈ విధంగా కూడా రైతన్నలకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు.

వంతుల వారీగా వదులుతున్నాం

నాగార్జునసాగర్ కెనాల్స్ నుంచి వచ్చే నీటిని కొండూరు వద్ద కస్తల మేజర్, చింతపల్లి మేజర్‌కు వంతుల వారీగా వదులుతున్నాం. కస్తల మేజర్ కింద భూములకు ఇప్పటికి ఒక తడికి సరిపోను నీటిని వదిలాం. వారబందీ వల్ల నాగర్ నుంచి కావలసినంత మేరకు సాగునీరు రావడం లేదు. దీనికి తోడు కాలువలు మరమ్మతులో ఉండటం వల్ల నీటిని వదలలేకపోతున్నాం.

– చిల్కా భాస్కర్, ఏఈ, నాగార్జునసాగర్ కెనాల్స్

నూతన ఆలయానికి శంకుస్థాపన



పెదకూరపాడు : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో ఉండాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. మండలంలోని గారపాడు గ్రామంలో గ్రామస్తుల సహకారంతో నిర్మించనున్న గంగ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శంకుస్థాపన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శతచండీ మహాయాగ అంకురార్పణ



సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య పాఠశాల సమీపంలోని త్రిశక్తి దుర్గా పీఠంలో ఈ నెల 15 వరకు శతాధిక ప్రతిష్టా బ్రహ్మ, దేవి ఉపాసకులు, విశ్వధర్మ పరిరక్షణ వేదిక కోశాధికారి, పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ హనుమత్‌స్వామి వారి ఆధ్వర్యంలో నిర్వహించే పంచాయతన పూర్వక నవదుర్గాత్మక శతచండీ మహాయాగ అంకురార్పణ గురువారం భక్తిశ్రద్ధలతో జరిగింది. చండీ పారాయణం, శత చండీ హోమం, గురు వందనం, ప్రధాన దేవతార్చన, శత చండీహోమం, లలిత సహస్ర నామార్చన, దీపార్చన, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. అలాగే గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధన పూజ, కంకణ ధారణ, ఋత్విక్‌వరణం, అఖండ దీపస్థాపన, మాతృకాపూజ, అంకురారోపణ, నవగ్రహ యోగిని వాస్తు క్షేత్రపాలక సహిత సర్వతోభద్ర మండల దేవత ఆవాహనలు, ప్రధాన దేవత ఆవాహన, అగ్ని మథనం, అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం, లక్ష్మీ గణపతి హోమం, చతుర్వేద సేవ పూజలు ఆస్థాన పురోహితులు కలవకొలను సీతారామ శాస్త్రి నిర్వహించారు. గణేష్ యువసేన, త్రిశక్తి దుర్గా పీఠం బ్రహ్మోత్సవ కమిటీ, త్రిశక్తి దుర్గా పీఠం మహిళా శక్తి బాధ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హిందువులపై దాడులు దుర్మార్గం

పిడుగురాళ్ల: రాష్ట్రంలో హిందువులపై జరుగుతున్న దాడులను హిందూ చైతన్య వేదిక, విశ్వ హిందూ పరిషత్, వానర సేన సభ్యులు గురువారం ఖండించారు. పట్టణంలోని హిందు చైతన్య వేదిక కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరభద్రుని స్వామి ఉత్సవాల్లో అల్లరి మూకలు రాళ్ల దాడి చేశాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి దాడులపై దృష్టి సారించి, పునరావృతం కాకుండా చూడాలన్నారు. రాయచోటి ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐ, ఎస్ఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా హిందూ చైతన్య వేదిక అధ్యక్షుడు శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

లేగదూడలకు బ్రూసెల్లా టీకా పంపిణీ



టీకా పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి.రామారావు



ఊటుకూరులో పశువులకు వ్యాక్సిన్లు వేస్తున్న దృశ్యం



మాదలలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారి పుల్లారెడ్డి

నకరికల్లు: పశువులకు వ్యాధులు సోకకుండా లేగదూడ వయస్సులోనే టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి.రామారావు సూచించారు. మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో పెయ్యదూడలకు బ్రూసెల్లా టీకా వేసే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 నెలల నుంచి 8 నెలల వయస్సులోపు ఉన్న పెయ్యదూడలకు టీకా వేసినట్లు తెలిపారు. టీకా వేసిన దూడల జీవితకాలంలో బ్రూసెల్లా అబార్టస్ అనే బ్యాక్టీరియా ద్వారా సంక్రమించే వ్యాధులను అరికట్టవచ్చన్నారు. బ్యాక్టీరియా సోకడం ద్వారా వచ్చే వ్యాధులలో ఈసుకుపోవడం, ఈనిన తరువాత 24 గంటల్లో మాయ వేయకపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు పశు వైద్య సిబ్బంది రైతుల ఇంటి వద్దకు వెళ్లి లేగదూడలకు టీకా వేస్తారని తెలిపారు. టీకా కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి.వెంకటేశ్వర్లునాయక్, జేవీవో ఆర్.వెంకట్రామయ్య, ఏహెచ్ఏలు పి.సుర్యారావు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు

క్రోసూరు: జాతీయ పశు వ్యాధి నివారణ పథకంలో భాగంగా మండల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్లు, బ్రూసెల్లా వ్యాక్సిన్లు వేస్తున్నట్లు గురువారం మండల పశు వైద్యుడు డాక్టర్ మల్లయ్య తెలిపారు. ఊటుకూరు, దొడ్లేరు, 88 త్యాళ్లూరులో నిర్వహించిన వైద్య శిబిరాల్లో 2,100 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక వ్యాక్సిన్లు, 100 పశువులకు బ్రూసెల్లా వ్యాక్సిన్లు వేసినట్లు తెలిపారు. ఈ నెల 30 వరకు ఉచిత వైద్య శిబిరాలు జరుగుతాయని తెలియజేశారు. పశు పోషకులు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పశువులకు టీకాల కార్యక్రమం

మాదల(ముప్పాళ్ళ): జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మార్చి 30వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాదల పశు వైద్యాధికారి ఎం.పుల్లారెడ్డి గురువారం తెలిపారు. ప్రతి గ్రామంలోని పశు వైద్య సిబ్బంది టీకాలు అందిస్తారన్నారు. పశు పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్వేత వైష్ణవి దాల్ మిల్లులో చోరీ



దాల్ మిల్లులో పగలగొట్టిన ఇనుప బీరువా

సత్తెనపల్లి: దాల్ మిల్లులో చోరీ జరిగిన ఘటన పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయం ఎదుట గురువారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శ్వేత వైష్ణవి దాల్ ప్రొడ్యూసర్స్ (జ్యోతిలక్ష్మి దాల్‌మిల్)లో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి షట్టర్ తాళాలు పగలగొట్టి స్టోర్ రూమ్‌లో ఉన్న కౌంటర్‌ను ఓపెన్ చేసి రూ.30 వేలు అపహరించారు. అంతేకాక సీసీ పుటేజ్, వై ఫై రూటర్ తదితర సామగ్రిని ఎత్తుకెళ్లారు. బీరువా లోపల ఉన్న బాక్సులను పగలగొట్టి ఏమీ దొరకకపోవడంతో వాటిని వదిలేశారు. ఆఫీస్ కౌంటర్ బాక్సును పగలగొట్టి చిందరవందరగా పడేశారు. దాల్ మిల్లు వెనుక పెద్ద షట్టర్‌ను పెద్ద రాడ్లతో మనుషులు వెళ్లే అంత ఎత్తుగా లేపి పగలగొట్టి మిల్లులోకి ప్రవేశించినట్లుగా తెలుస్తోంది. గురువారం దాల్ మిల్లు నిర్వాహకుడు జవ్వాజి రవి మిల్లు ఓపెన్ చేయగా అన్నీ పగలగొట్టి ఉండడాన్ని గమనించి పట్టణ సీఐ బొప్పన బ్రహ్మయ్యకు సమాచారం అందించారు. దీంతో పట్టణ పోలీసులు ఘటన స్థలాన్ని సందర్శించి గుంటూరు క్లూస్ టీంకు సమాచారం అందించగా క్లూస్ టీం నిశితంగా పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. అక్కడ పని చేసే సిబ్బంది నుంచి ఆధారాలు సేకరించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి

వడ్డే ఓబన్న విగ్రహ కమిటీ చైర్మన్ కొమ్మెర అనంతరామయ్య



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అనంతరామయ్య, వడ్డెర సంఘ నాయకులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా మాచర్లలో ఈ నెల 16వ తేదీన జరిగే వడ్డే ఓబన్న విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలని వడ్డే ఓబన్న విగ్రహ కమిటీ చైర్మన్ కొమ్మెర అనంతరామయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని వడ్డెర సంఘ కార్యాలయ ఆవరణలో వడ్డెర షార్ప్ థింకింగ్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు బత్తుల వెంకటస్వామి అధ్యక్షతన గురువారం జరిగిన నియోజకవర్గ వడ్డెర సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అనంతరామయ్య మాట్లాడుతూ సత్తెనపల్లి ప్రాంత వడ్డెర కులస్తులంతా భారీగా తరలివచ్చి ఆ మహోన్నతమైన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ సందర్భంగా వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వడ్డెర వెల్ఫేర్ బోర్డు జిల్లా మాజీ సభ్యుడు కొమెర వీరాంజనేయులు, కొమెర దుర్గారావు, చల్లా పిచ్చయ్య మాస్టారు, తురకా వీరాస్వామి, పల్లపు ధర్మారావు, ఒంటిపులి నాగేశ్వరరావు, దేవళ్ళ రాంబాబు, బత్తుల శ్రీను, కుంచపు శ్రీను, తమ్మిశెట్టి ఏడుకొండలు, కుంచపు గంగరాజు, తన్నీరు నరసింహారావు, చల్లా అంజి, గుంజి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలి

మాచర్ల: అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణానికి సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్.బాలాజీనాయక్ తెలిపారు. హౌసింగ్ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 31వ తేదీలోపు ప్రతి ఒక్కరూ సొంతింటి నిర్మాణ రుణం కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం రూ.2.50 లక్షల రుణం మంజూరు చేస్తుందని వెల్లడించారు. సొంత స్థలం ఉన్నా ప్రభుత్వం ఇచ్చిన పట్టా ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరో నాలుగేళ్ల పాటు గృహ నిర్మాణానికి రుణాలు మంజూరు చేసే అవకాశం లేదన్నారు. ఈ నెలాఖరులోపు ఇంటి దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాచర్ల ఏఈ సాతులూరి మరియదాసు, దుర్గి మండల ఏఈ చింతపల్లి లక్ష్మి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజ స్తంభం ఊరేగింపు



వడ్డవల్లిలోని వీరాంజనేయస్వామి



ధ్వజ స్తంభం ఊరేగింపులో భక్తులు

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి వీరాంజనేయస్వామి వారి దేవస్థాన జీవధ్వజ ప్రతిష్ట మహోత్సవం రెండో రోజు భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ఆరాధన, పంచగవ్యప్రాసన, అగ్ని ధ్యానం, ఏకాదశ మన్యుసూక్త హోమం, చతుర్ధ కలశ స్థాపన, పంచగవ్యాధివాసం, క్షీరాధివాసం జలాధివాసం, ఆదివాసాంగ హోమాలు, నీరాజనం, మంత్రపుష్పం నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి జలబిందెలతో భక్తులు నీటిని తీసుకొచ్చి ధ్వజ స్తంభంపై పోసి ఉత్సవం వైభవంగా జరిపారు. మధ్యాహ్నం జీవ ధ్వజ స్తంభాన్ని ప్రత్యేకంగా ట్రాక్టర్‌పై కట్టి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. మహిళలు కోలాటం నిర్వహించారు. ఊరేగింపుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కార్యనిర్వహణాధికారి సన్నిమెళ్ళ కోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

• మొదలైన వేసవి ఫ్రిజ్‌ల విక్రయాలు



వేసవి కాలంలో చల్లని మంచినీళ్లు తాగాలని ప్రతి ఒక్కరు కోరుకుంటారు. అయితే ఆధునిక కాలంలో ఫ్రిజ్‌లు అందుబాటులోకి రావటంతో ప్రజలు మట్టి కుండలు దాదాపుగా మరచిపోయారు. అయితే సంప్రదాయంగా వస్తున్న మట్టి కుండ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని తెలియటంతో ఎక్కువ మంది వేసవి కాలంలో మట్టి కుండలు తెచ్చుకుంటారు. క్రోసూరులో ప్రతి వేసవిలో కృష్ణా జిల్లా నుంచి మట్టి కుండలు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. స్థానిక వెలుగు కార్యాలయం వద్ద విక్రయిస్తున్న మట్టి కుండలు ఈ ఏడాది రూ.100 నుంచి రూ.300 వరకు పలుకుతున్నాయి. సైజుల్ని బట్టి ధరలు ఉన్నాయి. అదే విధంగా మట్టి కుండలతో పాటు మట్టితో తయారు చేసిన చిన్న చిన్న హండీలు, ఇతర రకాలు అనేకం విక్రయిస్తున్నారు.

– క్రోసూరు